క్లుప్తంగా

వైభవంగా ఉట్టి ఉత్సవం



శ్రీకృష్ణుడి ఆలయం వద్ద ఉట్టి ఉత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో యాదవ సంఘం యువత ఉట్టి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని ఆలయ ప్రాంగణానికి చేరుకుని ఉట్టి ఉత్సవంను చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుడి ఆలయం వద్ద 12 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేసిన ఉట్టిని యువకులు ఒకరిపై ఒకరు ఎక్కుతూ ఉట్టిని అందుకుని పగులగొట్టారు. దీంతో గ్రామంలో శ్రీ కృష్ణుడి జయంతి ఉత్సవాలు ముగిశాయని ఉత్సవ నిర్వాహకులు, పెద్దలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దంత వైద్యురాలు

గడివేముల: మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నంద్యాలకు చెందిన దంత వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ కావ్య శ్రీరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్లను గ్రామస్తులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన షేక్షావలి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన షేక్షావలి (31) బైక్‌పై యూటర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న తుపాన్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్షావలిని స్థానికులు హుటాహుటిన శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని ఐసీయూలో ఉంచి డాక్టర్లు చికిత్స అందించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తుపాన్ వాహనం అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

మతసామరస్యానికి ప్రతీక పెద్దరాజు స్వామి దర్గా

బేతంచెర్ల: మతసామరస్యానికి ప్రతీకగా చారిత్రక నేపథ్యం కల్గి వేలాది మంది భక్తులు దర్శించేది గూటుపల్లె పెద్ద రాజు స్వామి దర్గా. మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్‌బాషా ఉరఫ్ పెద్దరాజు స్వామి వారి ఉరుసును అన్ని మతాల వారు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు ఉరుసు ఘనంగా నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

స్వామివారి మహిమలు

ఇద్రూస్ బాషా ఉరఫ్ పెద్ద రాజు గూటుపల్లెలో స్థిర నివాసం నిర్ధారణ అయిన తరువాత గొర్రెల కాపరుల భయం పోగొట్టేందుకు కొండపై ఉన్న పులులను కొండ తీగలతో కట్టి తీసుకొని రావడంతో వీరికి పెద్దరాజు అని పేరు వచ్చింది. అందువల్ల ఆయనను పెద్దరాజు స్వామిగా పిలుస్తున్నారు. ప్రతి గురువారం పెద్ద పులి వచ్చి తనతోకతో గర్భగుడిని శుభ్రం చేసేదని చరిత్ర చెబుతుంది. దర్గ ఆవరణలో దెయ్యం, భూతం, పిశాచి పీడలు కలవారు ఒక్క రోజు నిద్ర చేస్తే పీడల తొలిగిపోతాయని గ్రామస్తుల విశ్వాసం.

ఉరుసుకు ప్రత్యేక ఏర్పాట్లు

కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా నిర్వాహకులు గురు సయ్యద్‌షా బాష ఖాద్రి తెలిపారు. 20న గంధం, 21ఉరుసు, 22 జియారత్ ఉత్సవాలు ఉంటాయన్నారు.

చిన్న చినుకులకే పెద్ద మడుగులు



కోడుమూరులో ప్రధాన రోడ్డుపై నిలిచిన వాన నీరు



పాతబస్టాండ్ సెంటర్‌లో..

- కోడుమూరులో రోడ్లపై నిత్యం వాన నీటి నిల్వ
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

కోడుమూరు రూరల్: కోడుమూరులో చినుకుపడితే చాలు ప్రధాన రోడ్లపై వాన నీరు నిలిచిపోతుంది. చిన్నపాటి వాన కురిసినా పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు సర్కిల్, పాతబస్టాండ్ సెంటర్, శ్రీరాములవారి ఆలయం సమీపంలోని ప్రధాన రోడ్ల వెంట మడుగులేర్పడి రోజుల తరబడి వాన నీరు నిలిచిపోతుంది. దీంతో రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లపై పడ్డ వాననీరు వెళ్లేందుకు మార్గాలు లేకపోవడం, ఉన్న కాల్వలను దుకాణదారులు మూసివేయడం, రోడ్డు వెడల్పు లేకపోవడం వంటి కారణాలతో ఈ సమస్య తలెత్తుతోంది. రోడ్లపై నిత్యం వాననీటి నిల్వ వల్ల కోడుమూరు-కర్నూలు, ఎమ్మిగనూరు రోడ్లపై భారీగా గుంతలేర్పడుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్లపై వాననీరు నిల్వ ఉండకుండా మార్గం చేయడంతో పాటు, రోడ్డు వెడల్పు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శ్రీరాముల వారి ఆలయం ఎదుట ప్రధాన రోడ్డులో..

రోడ్డంతా గుంతలమయం



జగన్నాథగట్టుకు వెళ్లే రోడ్డు దుస్థితి

కర్నూలు(రూరల్): నగర శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ పక్క నుంచి మొదలై జగన్నాథగట్టుకు వెళ్లే రోడ్డు టీ.జీ నగర్ రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఈ రహదారి పై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జగన్నాథగట్టు ఆలయానికి వెళ్లే భక్తులు, గట్టుపై కేంద్ర విద్యా సంస్థలకు రాకపోకలు సాగించేవారు. దిన్నెదేవరపాడు నుంచి కర్నూలు నగరానికి వచ్చేవారు, అనంతపురం రోడ్డు నుంచి దిన్నెదేవరపాడు గ్రామం మీదుగా నంద్యాల రోడ్డులో ఉన్న రాయలసీమ యూనివర్సిటీ, పుల్లారెడ్డి ఇంజినీరింగ్, డెంటల్ కాలేజీలకు విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో వాహనదారులు గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే!



దిన్నెదేవరపాడు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- రోడ్లపై నిలుస్తున్న వర్షపు నీరు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం



బురదమయంగా మారిన బస్తిపాడులోని ఓ వీధి రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లన్నీ చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. కల్లూరు అర్బన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్, పందిపాడు ఇందిరమ్మ కాలనీ, నాగేంద్ర కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పరిమళ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, ముజఫర్ నగర్ తదితర కాలనీలు, అలాగే వివిధ గ్రామాల్లో రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నీరు నిలిచి దోమలకు నెలవుగా మారుతున్నాయి. కొన్ని అర్బన్ కాలనీలో, గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు నిలుస్తోంది. దీంతో దోమలు, ఈగలు, లార్వాలకు నెలవుగా మారుతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు నిలిచింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్తిపాడు గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల పక్కన రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వ్యవసాయ కూలీలు, ఆటోలు, ప్రయాణిస్తుంటాయి. రోడ్డు బురదమయంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. చిన్నటేకూరు ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ కాలువ దెబ్బతినడంతో డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లడం లేదు. డ్రైనేజీ మొత్తం చెత్త చెదారంతో నిండి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు, ప్రయాణికులు వాపోతున్నారు.

ముగిసిన రోజా దర్గా ఉరుసు



కిస్తీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలోని దర్గా వీధిలో వెలసిన సయ్యద్ గరీబ్ వలీ దాదా రహంతుల్లా దర్గాలో మూడు రోజులుగా జరుగుతున్న ఉరుసు ఉత్సవాలు ఆదివారం మధ్యాహ్నం ఫజులుల్లా ఖాద్రి మత పెద్దల ఆధ్వర్యంలో జియారత్ ఫాతేహాల్ కార్యక్రమంతో ముగిశాయి. ఉరుసులో భాగంగా నిర్వహించే కిస్తీ కార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సావాలను తిలకించేందుకు వచ్చిన ప్రజలతో దర్గా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. దర్గా ప్రధాన వీధిలో పిల్లల ఆటల సామగ్రి, గాజులు, మహిళ అలంకరణ సామగ్రి, మిఠాయిల అంగళ్లు తదితర అన్ని దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు మత సామరస్యంగా ఉరుసును జరుపుకున్నారు.



సయ్యద్ గరీబ్ వలీ దాదా రహంతుల్లా దర్గా వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు

పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని, హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు.

వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వాలి



మాట్లాడుతున్న వి.రాంభూపాల్

కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలన్నారు. వెనుకబడిన కర్నూలు అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 44లో కేంద్రం స్పష్టంగా వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని చెప్పినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. దీంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు ఇప్పటికీ వెనుకబడి ఉన్నాయని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు ఎండీ ఆనంద్ బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడి పల్లకీని ఊరేగిస్తున్న పాల్గొన్న భక్తులు

శ్రీకృష్ణ పల్లకీ ఊరేగింపు

కల్లూరు: కృష్ణాష్టమి సందర్భంగా కొలువుదీరిన శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండల పరిధిలోని రెమడూరు గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహం కొలువుంచారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెమడూరులో శ్రీకృష్ణ పరమాత్ముడి ఊరేగింపు కార్యక్రమం ఆదివారం దిగ్విజయంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వహకులు ఓబులేసు, పురుషోత్తం రెడ్డి, శేషయ్య, గంగన్న, సుధాకర్, శివ, లత, లక్ష్మి, సునీత, పద్మావతి, అనిత, నరసింహ, మద్దిలేటి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా బెల్టు దందా

- ఇబ్బడిముబ్బడిగా మద్యం విక్రయాలు
- వేళాపాల లేకుండా లభ్యమవుతున్న మద్యం

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో మద్యం అమ్మకాలు ఇబ్బడిముబ్బడిగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన మద్యం దుకాణం నుంచి యథేచ్ఛగా బెల్టు షాపులకు తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామానికి చెందిన కూటమి నాయకులు సిండికేట్‌గా మద్యం షాపును నిర్వహిస్తున్నారు. ఈ షాపులో నిబంధనలకు విరుద్ధంగా మద్యం ప్రియులను కూర్చోబెట్టడమేగాక, మద్యం షాపు పరిధిలో కేవలం ఒక్క హుసేనాపురం గ్రామంలోనే 10–12 బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. మిగతా కాల్వబుగ్గ, ఎస్.కొంతలపాడు, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, పాలకొలను, చింతలపల్లె, కొమరోలు గ్రామాలలో రెండేసి చొప్పున బెల్టు షాపులను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ గ్రామాలకు హుసేనాపురం మద్యం షాపు నుంచే మద్యం సరఫరా జరుగుతోంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మందుబాబులను కట్టడి చేయాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెల్టు షాపులను అనుమతించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మద్యం ధరలను తగ్గిస్తాం, పాత బ్రాండ్లను అందుబాటులోకి తెస్తామని ప్రచారం చేశారు. కానీ అందుకు విరుద్ధంగా బెల్టు షాపుల దందా కొనసాగుతోంది. దీంతో మందుబాబులు ఎక్కడికి వెళ్లకుండా, ఉన్న ఊరులోనే దర్జాగా మద్యం లభిస్తోంది. టీడీపీ నాయకులు నిర్భయంగా బెల్టు షాపులను నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులోనే మద్యం సేవిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. పూటుగా మద్యం సేవించిన మద్యం బాబులు ఎక్కడపడితే అక్కడ మూత్రవిసర్జన చేయడంతో అటుగా వెళ్లే మహిళలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. అంతేగాక, మద్యం షాపు నుంచి స్థానిక వాటర్ షాపులతో పాటు, ఆయా గ్రామాలలోని బెల్టు షాపులకు యథేచ్ఛగా అక్రమ మద్యం సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరమైతే పోటీపడి డోర్ డెలివరీ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు వేళాపాల లేకుండా మద్యం లభించడం గమనార్హం. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై మతలబు ఏమిటనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ మద్యం వ్యాపారాన్ని, బెల్టు షాపులను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మైదానంలో పిచ్చిమొక్కలు

బీసీ రెసిడెన్సియల్ స్కూల్‌లో సమస్యల తిష్ట



కూలిన కాంపౌండ్‌వాల్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సమస్యలతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 1992లో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. 2008లో పాఠశాలకు పక్కా భవనాలను నిర్మించారు. విద్యాబుద్ధుల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నా ఈ పాఠశాలలో అసౌకర్యాల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడు నిర్మించిన కాంపౌండ్ వాల్ శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల పాఠశాల వెనక భాగంలో కాంపౌండ్‌వాల్ కూలిపోయింది. మరమ్మతులు చేసేందుకు పెట్టిన ప్రతిపాదనలే దిక్కు లేకుండా పోయాయి. చేసేది లేక అలాగే వదిలేశారు. కాంపౌండ్ వాల్ పక్కనే వరి పొలాలు ఉండడంతో విషసర్పాలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి.

మైదానంలో పిచ్చి మొక్కలు

పాఠశాలలో సరైన నిర్వహణ లేని కారణంగా ఇటీవల వర్షాలకు మైదానంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విద్యార్థులు మైదానంలో ఆడుకోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని మైదానాన్ని శుభ్రం చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మను వివరణ కోరగా కాంపౌండ్‌వాల్ గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పునఃనిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం. మండల స్థాయి అధికారులకు సూచించాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఎప్పటికప్పుడు పిచ్చిమొక్కలు తొలగిస్తున్నాం అని చెప్పారు.

జరభద్రం



మద్దూరు ఆస్పత్రి గేటు వద్ద బురద గుంతలు

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు పీహెచ్‌సీకి వెళ్లేందుకు ప్రధాన గేటు వద్ద ఏర్పడిన బురద గుంతలతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గేటు వద్ద లోతైన గుంతలు బురద మయంగా మారడంతో వాహనదారులు, బైక్‌లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏ మాత్రం ఆదమరిచినా అంతే సంగతే. బురదగుంతల కారణంగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని గుంతలను పూడ్చివేసి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



సి.బెళగల్‌లో బురదలో దిగి బస్సును తోస్తున్న ప్రయాణికులు

మొరాయించిన ఆర్టీసీ బస్సు

సి.బెళగల్: మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో వాహనదారులు, ప్రమాణికులు నిత్యం పలువురు ఆవస్థలు పడుతున్నారు. సి.బెళగల్‌లోని ఎమ్మిగనూరు - గూడూరు ప్రధాన రోడ్డులో ఇటీవల వర్షాలకు నీటి మడుగులు ఏర్పడి వాహనాల రాకపోకలతో బురదమయంగా మారింది. ఈ స్థితిలో ఆదివారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 21 జెడ్ 0747 బస్సు ప్రయాణికులతో గూడూరు నుంచి ఎమ్మిగనూరుకు వస్తూ మండల కాంప్లెక్స్ వద్ద ఒక్కసారిగా నిలిచిపోయింది. బస్సు బురదలో నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు బస్సును తోయక తప్పలేదు. బురదలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మరమ్మతుల అనంతరం బస్సు ఎమ్మిగనూరుకు వెళ్లిపోయింది. కాగా రోడ్డు దుస్థితి, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవస్థల సంత

పాణ్యం: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతలో వర్షంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4గంటలకు వర్షం ప్రారంభం కావడంతో వ్యాపారులు తెచ్చిన కూరగాయాలు, నిత్యవసర సరుకులు, ఇతర సామగ్రి తడిసిపోయాయి. వర్షంలోనే వ్యాపారులు, ప్రజలు కూరగాయాలు కొనుగోలు చేశారు. వారపు సంతలో ప్రజలు, వ్యాపారులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపై కూరగాయలు విక్రయించే వారు వర్షపు నీటితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా కూరగాయలను కొనేందుకు ప్రజలు తక్కువ సంఖ్యలో వచ్చారు.



వర్షంలో కూరగాయల విక్రయాలు



టార్పాలిన్ పట్టల కింద వ్యాపారాలు